
మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి



# మాయ

ఊరి మధ్య మాలక్షమ్మవారి చెట్టు కెదురుగుండా సుబ్బయ్య చిల్లర కొట్టు. ఆ చిల్లర కొట్లో ముందుగా కన్పించేది గల్లాపెట్టె. ఆ గల్లాపెట్టె కెదురుగా సుబ్బయ్య నిండైన విగ్రహం. తుమ్మ బెరడులాంటి శరీరంతో, నుదుట తిరుమణి తిరుచూర్ణాలు నిలువుగా దిద్దుకుని కూర్చున్నాడు సుబ్బయ్య. సుబ్బయ్య కెదురుగా త్రాసు. అది విచిత్రమైన త్రాసు, దాళా చూపించమని ఎవరూ అడగరు. సిబ్బెలకు అడుగున మైనపు ముద్దలు అతికి వున్నాయి.

గొలుసులకి ఏవో పసుపు కొమ్ములు, గుండ్రాళ్ళు వేలాడగట్టి వున్నాయి. దాళా సమంగా వున్నట్టు చూపించడానికి ఈ అలంకారాలు అన్నీ. ఇక రాళ్ల సంగతి సరేసరి! కొన్ని తూనికరాళ్ళు, కొన్ని గుండ్రాళ్ళు. అవేమిటని ఎవరూ అడగరు. రాళ్ల సంగతి అలా వుండగా గిన్నెలు, డబ్బాలు పడికట్టు కట్టడం సుబ్బయ్యకి మాత్రమే తెలిసిన విచిత్రమైన కళ. మొగ్గు ఎప్పుడూ గిన్నెవైపే. "ఏవిటి? పెద్దమ్మాయి పురిటి కొచ్చి

నట్టుందే! ఏవిటో నీరసంగా కన్పిస్తున్నారు" అంటూ మాటల్లో పెట్టి పడికట్టు కట్టే ఇవతల పక్క వెంగున తూనికిరాయి పెట్టేసేవాడు. వస్తువుల తూకం విషయంలో ఒక్క నూనెబొట్టు కూడా ఎక్కువ జారనిచ్చేవాడు కాదు.

సరుకుల కొచ్చిన జనం ఎక్కువవుతున్నకొద్దీ అష్టావధానం చేసేవాడు సుబ్బయ్య. సరుకులందించే ఇద్దరు కొడుకుల్నీ వూపిరాడనిచ్చేవాడు కాదు. "ఒరే బెల్లం అందుకో! నీ దుంపతెగ ఆవాలు తీసుకురావటం ఇంత సేపా? శనగనూనడిగితే నువ్వుల నూనె తెచ్చావేంట్రా చవటా" ఇలా శాపనార్థాలతో తరిమేవాడు. పది చేతుల్తో సరుకులు కట్టే ఇరవై నోళ్ల వచ్చినవాళ్లని పలకరించేవాడు. గల్లాపెట్టె నిండుతున్న కొద్దీ సుబ్బయ్యకి ఆవేశం పెరిగేది. కాశీ తువ్వాలుతో చమట తుడుచుకుంటూ ముందు అర లాగి చిల్లరంతా తాకేవాడు. హాయిగా వొళ్లు చల్లగా వున్నట్టనిపించేది. రెండో అర లాగి నోట్లు ముట్టుకునేవాడు. శరీరం గాలిలో తేలిపోతున్నట్లని పించేది. పక్కనే వున్న పద్దు పుస్తకం పట్టుకుంటే ప్రాణం చేతిలోకి వచ్చినట్లుండేది.

మనుషుల ముఖాలు చూడగానే అరువు బేరమో, కాదో తెలిసిపోయేది సుబ్బయ్యకి. అప్పు ముఖాల్ని పట్టించుకునేవాడు కాదు. ఓ వెంకయ్య వచ్చాడను కోండి.

"సుబ్బయ్యగారూ"

ఆ పిలుపు సుబ్బయ్యకి విన్పించదు.

"చెధవ సచ్చినోడా! ఎన్నిసార్లు చెప్పాల్రా కుంకుడుకాయల సోల తీసెయ్యరా అని."

"సుబ్బయ్యగారూ........"

పుల్లమ్మా.... నీ బేరం కాలేదమ్మా? కొనేది పావలా? మళ్లీ బెల్లం కొసరు......"

"సుబ్బయ్యగారూ...."

"పోరీ! ఆ ఉప్పులో చెయ్యి తియ్యి వచ్చేది లేదు. వచ్చేది లేదు. వస్తున్నాం ఈ చిన్న బేరాల్తోటి?"

"సుబ్బయ్యగారూ......."

అప్పటికి చెవికి సోకుతుంది ఆ పిలుపు. విసుగంతా ముఖానికి పులుముకుని "ఏంటి వెంకయ్యా! చూస్తున్నావుగా! నా కేవన్నా పది చేతులా? చెవులో ఒకటే రొద, ఆ... ఏం కావాలో చెప్పు?"

అప్పటికే సగం చచ్చిపోయిన వెంకయ్య "బియ్యం..." మాట తుంచేసి "పద్దయితే నా వల్ల కాదయ్యా..." అని ముఖం తిప్పేసుకుని ఇంకెవరికో సరుకులు కడుతున్నాడు సుబ్బయ్య.

మరి కొంతసేపటికి "సుబ్బయ్యగారూ" అన్న పిలుపు.

పద్దు పుస్తకం టాప్పున కొట్టి "నే నెక్కడ చస్తానయ్యా! అప్పులిచ్చి కూర్చుంటే నా కిచ్చేవాడివ్వొద్దూ?" అని గదమాయిస్తాడు.

"ఎక్కడికి పోతానండీ! మా నాయన మీ దగ్గరే పద్దు, నేను మీ దగ్గరే... వూరిడిచి పెట్టి పోతామా?" అని వెంకయ్యంటే "మీ రెక్కడికీ పోరండీ! ఇట్లా అప్పులిస్తే నేనే చెంగేసుకుపోవాలి? చెప్పండి ఏం కావాలో" అని ఉద్ధరిస్తున్నట్లు సరుకులు తూస్తాడు. అప్పు కాబట్టి తక్కువ తూచినా, పద్దులెక్కువ రాసుకున్నా వెంకయ్య అడగలేదు. అలా మధ్యాహ్నానికి గల్లాపెట్టె బరువు పెరగ్గా, తాళం వేసుకుని కొడుకుని కొట్లో వుంచి భోజనానికి లేస్తాడు సుబ్బయ్య.

అరవై ఏళ్ల దగ్గర పడుతున్నా, కూరా పప్పూతో అన్నం తిని ఎరగడు సుబ్బయ్య. వారానికోసారి పప్పు వండించుకుంటే అది జీర్ణమవడానికి వారమంతా పట్టేది. బతకటానికి పచ్చడి మెతుకులు చాలు అని చిన్నప్పుడు అనుకున్నట్టే ఇప్పుడూ అనుకుంటున్నాడు. ఇంటి కొచ్చినా గల్లాపెట్టె మీదే ధ్యాస. కుర్ర సన్నాసి తూకం సరిగ్గా తూస్తాడో లేదో అని గొంతులో మెతుకులు సమంగా దిగకుండానే పరుగు పరుగున కొట్టు కెళ్లేవాడు.

రాత్రి ఇంటికొచ్చి డబ్బు సంచీ ఇనప్పెట్టెలో పెట్టి, తాకట్టు నగలు తాకి చూసుకుని, ప్రాంసరీ నోట్లని పరామర్శించి, వేసిన తాళం ముమ్మారు లాగి అక్కడే పడుకునేవాడు. రాత్రిళ్లు అన్నం తినటం మాని పదేళ్లయింది. చిన్నప్పుడు మరమరాలమ్ముకునే తను ఇంతవాడయ్యాడు. పదెకరాల పొలం, రెండిళ్ళు, నలభై వేల రొక్కం, అన్నీ చిల్లరకొట్టు మీదే సంపాదించాడు. పెళ్లాన్ని కాదుగదా, కొడుకుల్ని కూడా నమ్మకుండా కడుపు కట్టుకు సంపాదించిన సుబ్బయ్యకి ఆఖరి రోజుల్లో ఏం తిన్నా లోపల ఇమిడేది కాదు. ఇంగ్లీషు డాక్టరు ఖరీదని, అరసోలెడు కందిపప్పు ఇచ్చి ఆయుర్వేదం మందు తిన్నాడు. అయినా కుదరలేదు.

ఉపోషాలు చేస్తున్నా, రోగంతో నీరసించి పోతున్నా కొట్టుకు వెళ్లటం మానలేదు. కొడుకుల్ని నమ్మలేదు. ఓ రాత్రివేళ సుబ్బయ్యకి వున్నట్టుండి ఆకలేసింది. పిలిస్తే ఎవరూ పలకలేదు. తనే వంటింట్లో కెళ్లి గిన్నెలు చూస్తే అక్కడ రెండు కూరలు! పప్పు!! వాటిని చూసి సుబ్బయ్యకి వెన్నెముకలో చలి వొచ్చింది. పెళ్లాం, పిల్లలు ఇవి చందుకు తింటున్నారన్నమాట! కోపంతో వణికిపోయాడు. పచ్చడి, చింతపండు చారు తప్ప తెలియని సుబ్బయ్య ఆ కూరలెట్లా వుంటాయో చూద్దామనుకున్నాడు. కాని 'ఛీ' అనిపించింది.

'పెళ్లాం పిల్లలు! ఛీ ఛీ!' అనుకుంటూ రొప్పుకుంటూ గదిలోకొచ్చి పడ్డాడు.

"పెళ్లాం పిల్లలు మాయ!" అని శాస్త్రుర్లుగారు చెప్పింది జ్ఞాపకం వచ్చింది. సుబ్బయ్య గిజగిజ లాడిపోతున్నాడు. "పెళ్లాం పిల్లలు మాయ! మాయ! మాయ!!" అని గొణుక్కుంటూ డబ్బు సంచులూ, ప్రాంసరీ నోట్లూ గుండెలకి హత్తుకుని ప్రాణాలు విడిచాడు.

*